

జాబిల్లితో 'అనుసంధానం'!

షార్ నుంచి ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఈనెల 14న నిర్వహించనున్నారు.

- 8లో



కీచక టీచర్లపై విచారణ

వెంకటగిరిలోని బంగారుపేట విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై విచారణ చేపట్టారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	25
చిత్తూరు	34	25
తిరుమల	31	22
గూడూరు	38	27
నగరి	36	26

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,483 మంది స్వామివారిని దర్శించుకోగా.. 32,459 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పోర్టల్ ప్రాజెక్టు అంశాలపై సమీక్ష

తిరుపతి అర్బన్: ప్రధానమంత్రి ప్రాజెక్ట్ మానిటరింగ్ పోర్టల్‌లో సూచించిన ప్రాధాన్యత అంశాలపై దృష్టి పెట్టాలని ఆర్‌అండ్‌బీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పీ.ఎస్.ప్రద్యుమ్న సూచించారు. శనివారం కేంద్ర కేబినేట్ సెక్రటరీ, ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ అమరావతి నుంచి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి, రైల్వేలకు భూసేకరణ, ఆటవీ అనుమతులు, ఏపీఐఐసీ భూముల వివరాలు, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల నిర్మాణాలు, జాతీయ రహదారుల తదితర అంశాలపై పురోగతి చూపాలని సూచించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ల్యాండ్ అక్విజేషన్ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు బంగారు గొలుసు వితరణ



బంగారు గొలుసు అందిస్తున్న బాలాజీరంగకుమార్

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి రూ.1.82 లక్షల విలువైన 30 గ్రాముల బంగారు గొలుసును ఆలయ అర్చకులు బాలాజీ రంగకుమార్ విరాళంగా అందించారు. బంగారు గొలుసును ఏఈఓ గోపీనాథ్ చేతుల మీదుగా అధికారులకు అందించారు. స్వామివారిపై భక్తితో బంగారు గొలుసును వితరణ చేసినట్లు బాలాజీ రంగకుమార్ తెలిపారు.

11న బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 17న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని జూలై 11వ తేదీన మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జూలై 11న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. జూలై 10న సోమవారం సిఫారసు లేఖలు స్వీకరించరు.



తిరుపతిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి



వెంకటగిరి బాలసదన్‌లో పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి



నాయుడుపేటలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

అభిమానం.. అజరామరం

ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఊరంతా నీ జ్ఞాపకాలే
పొలానికెళ్లినా.. పట్టణానికి వెళ్లినా నీ ప్రతిరూపాలే
నీ పథకాలు పదిలం.. నిను మేము మరువలేం!
జోహార్ వైఎస్సార్..జోహార్ వైఎస్సార్!



జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా తేడాలేకుండా.. ఊరూవాడా ఏకమై పండుగ చేసుకున్నారు. వైఎస్సార్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఆత్మీయంగా నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేస్తూ.. పేదలకు అన్నదానం చేస్తూ.. సేవా కార్యక్రమాల్లో మునిగితేలారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలు ప్రాంతాల్లో తమ అభిమాన నేత విగ్రహాలను ఆవిష్కరించారు.

- వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుకలు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలు ఆవిష్కరణ.. భారీ ర్యాలీలు



నగరి మండలం, బుగ్గఅగ్రహారంలో వైఎస్సార్ విగ్రహావిష్కరణకు ర్యాలీగా తరలివస్తున్న మంత్రి ఆర్కే రోజా

సాక్షి, తిరుపతి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను అభిమానులు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేదలకు భోజనాలు.. రోగులకు పండ్లు, రక్తదాన శిబిరాలు నిర్వహించి వైఎస్సార్‌పై ఉన్న అభిమానాన్ని చాటుచుకున్నారు.



గూడూరులో ఎమ్మెల్యే వరప్రసాద్ నివాళి

- తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురమల్లి రాంకుమార్‌రెడ్డి వెంకటగిరిలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బాలసదన్‌లోని అనాథ చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- నగరి మండలం, బుగ్గఅగ్రహారం కూడలి వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని మంత్రి ఆర్కే రోజా ఆవిష్కరించారు. అంతకుముందు ఆమె భారీ ర్యాలీ నిర్వహించారు. బుగ్గఅగ్రహారం జనసంద్రంతో నిండిపోయింది.
- తిరుపతి నగరంలోని నెహ్రూనగర్ పడమటి వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, అన్నదానం చేశారు. ఎస్వీ యూనివర్సిటీలో ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే, ఎస్వీయూ ఉపకులపతి రాజారెడ్డి పాల్గొన్నారు.
- శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలో పేదలకు అన్నదానం చేశారు.
- సత్యవేడు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు.
- గూడూరు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్‌లు పంచి పెట్టారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని నాయుడుపేటలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. తడ పరిధిలోని కొండూరు ఏఎంసీ కార్యాలయ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ భవనాన్ని ప్రారంభించారు.
- జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, సచివాలయాల పరిధిలో జెట్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని గ్రామాల్లో అన్నదానాలు చేశారు.



నారాయణవనంలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



పాకాలలో కేక్ కట్ చేస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి



రేణిగుంటలో పేదలకు అన్నదానం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి



నగరిలో పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి

వరాల దేవుడు వైఎస్సార్

- ఘనంగా రైతు దినోత్సవం
- అన్నదాతకు వెన్నుదన్నుగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం
- జిల్లాలో 2,193 మందికి లబ్ధి
- సత్యవేడులో జిల్లా స్థాయి కార్యక్రమం
- మెగా చెక్కు పంపిణీ చేసిన కలెక్టర్, ఎమ్మెల్యే



మెగా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

సత్యవేడు: 'వరాల దేవుడు వైఎస్సార్. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు' అని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గుర్తుచేశారు. వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా శనివారం అనంతరం జిల్లా, కళ్యాణదుర్గంలో ఉచిత పంటల బీమా పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించగా.. అదే సందర్భంలో స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సత్యవేడులో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతుల మేలుకోరి ఉచిత విద్యుత్ పథకంపై తొలిసంతకం చేశారని కొనియాడారు. అనంతరం సత్యవేడులో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పేదలకు అన్నదానం చేశారు.

రైతే రాజు

అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రైతే రాజని, దేశానికి వెన్నెముక అని తెలిపారు. వైఎస్సార్ రైతు బాంధవుడని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. తిరుపతి జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు మంజూరయ్యాయని, మొదటి దశలో నాలుగు నియోజకవర్గాల్లో ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలలు ప్రారంభించామన్నారు.

నాణ్యమైన వ్యవసాయమే లక్ష్యం

నాణ్యమైన వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ తెలిపారు. రైతులకు నాణ్యమై ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు నెలకొల్పినట్టు వెల్లడించారు. ఈ ప్రయోగ శాలల్లో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యతా ప్రమాణాలను ఉచితంగా పరీక్షించుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు తిరుపతి జిల్లా స్థాయిలో 958 ఎరువుల నమూనాలు, 1,312 విత్తన నమూనాలు పరీక్షించినట్టు తెలిపారు. వాటిలో 9 రకాల ఎరువులు, 17 విత్తన నమూనాలు నాణ్యత లేవని నిర్ధారణయ్యిందన్నారు.

బీమా లబ్ధిదారుల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	పరిహారం మొత్తం రూ
కేవీబీపురం	27	99,404
శ్రీకాళహస్తి	400	17,87,620
ఏర్పేడు	112	2,72,965
తిరుపతి రూరల్	12	5,851
చిన్నగొట్టికల్లు	927	34,15,169
పాకాల	719	15,01,228

కీచక టీచర్లపై విచారణ



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎస్పీలు

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై తిరుపతి దిశా డీఎస్పీ కాటమరాజు, గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ విచారణ చేపట్టారు. ఈ మేరకు వారు శనివారం బంగారుపేట ఎంపీయూపీ పాఠశాల వద్దకు చేరుకొని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. తిరుపతి దిశా డీఎస్పీ మాట్లాడుతూ బాలికలకు రక్షణ కవచంలా పోక్సోయాక్ట్, దిశా చట్టం అమల్లో ఉన్నాయని, బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఎంతటివారికైనా నేరం రుజువైతే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ బాలికల పట్ల తమ ఇంట్లో తల్లిదండ్రులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జాబిల్లితో అనుసంధానం!



ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్‌కు రెండో దశలోని ఎల్‌–110 దశను అమర్చేందుకు వ్యాబ్‌–2కు తీసుకెళుతున్న దృశ్యం



రాకెట్‌కు మొదటి దశలోని ఎస్‌–200, ఎల్‌–110 దశలను అమర్చుతూ..



రాకెట్‌లోని ఎస్‌–200, ఎల్‌–110 దశలను పూర్తి చేసి క్రయోజనిక్ దశను అమర్చేందుకు సిద్ధం చేసిన దృశ్యం

- 14న చంద్రయాన్‌–3 ప్రయోగం
- చంద్రుడిపై రహస్యాల సేకరణే లక్ష్యం
- ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ అనుసంధానం పనులు ముమ్మరం

సూళ్లూరుపేట: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్‌–3 ప్రయోగాన్ని ఈనెల 14న నిర్వహించేందుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పనులు పూర్తిచేశారు. పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే అదే జీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను మాత్రం మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. జీఎస్‌ఎల్‌వీ మార్క్‌–3 విషయానికొస్తే అత్యంత శక్తివంతమై రాకెట్ ఇది. మూడు వేల కిలోల నుంచి ఆరు వేల కిలోల బరువు కలిగిన ఉపగ్రహాలను సునాయాసంగా రోదసీలోకి తీసుకెళ్లగలదు. ఈ రాకెట్‌కు ముందుగా జీఎస్‌ఎల్‌వీ మార్క్‌–3 రాకెట్‌గా నామకరణం చేసి 2019లో చేసిన చంద్రయాన్‌–2 ప్రయోగం నుంచి ఎల్‌వీఎం3–ఎం1 అనే నామకరణంతో సంబోధిస్తున్నారు. దీనికి అత్యంత శక్తివంతమైన రెండు స్ట్రాపాన్ బూస్టర్లు ఉంటాయి. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 200 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. మొదటి దశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో ఉన్న 400 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను పూర్తి చేస్తారు. 110 టన్నుల ద్రవ ఇంధనంతో (ఎల్‌–110)తో రెండో దశను, 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనం (సీ–25)తో మూడో దశ ప్రయోగాన్ని పూర్తిచేసే విధంగా రూపొందించారు. అయితే ఎల్‌వీఎం–3 రాకెట్ సిరీస్‌లో ఇది ఏడో ప్రయోగం. ఇప్పటి దాకా అన్నీ విజయవమయ్యాయి. ఎల్‌వీఎం3–ఎం4 రాకెట్ 640 టన్నులు బరువు కలిగి ఉంటుంది. 3,900 కిలోల బరువు కలిగిన చంద్రయాన్‌–3 ఉపగ్రహంలో మూడు విభాగాలుగా ఉండడంతో దీన్ని త్రీ ఇన్ వన్ మిషన్‌గా సంబోధిస్తున్నారు. జూలై 14న ప్రయోగించిన తర్వాత చంద్రయాన్‌–3 మిషన్ సెప్టెంబర్ 6 దాకా 3.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించి చంద్రుని కక్ష్యలోకి చేరుతుంది. ప్రపొల్షన్ మాడ్యూల్‌కు అనుసంధానం చేసిన ల్యాండర్ చంద్రుడికి 30 కిలో మీటర్ల ఎత్తులో విడిపోతుంది. అక్కడి నుంచి ల్యాండర్ నెమ్మదిగా చంద్రుడిపై దిగుతుంది. ల్యాండర్ దిగిన తర్వాత అందులో అమర్చిన రోవర్ బయటకు వచ్చి చంద్రుడిపై పరిశోధనలను ప్రారంభించి సమాచారాన్ని భూ నియంత్రిత కేంద్రానికి అందిస్తుంది.

చీటీల పేరుతో మోసం

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని గొట్టిప్రోలు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు మహిళల వద్ద అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి సుమారు రూ.4 కోట్లకు పైగా చీటీల నగదు వసూలుచేసి మోసం చేశారని బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొట్టిప్రోలు గ్రామానికి చెందిన లింగారెడ్డి రాజారెడ్డి, అతని భార్య సుప్రియ మరికొంతమంది విద్యానగర్ ప్రాంతానికి చెందిన మహిళలు కలసి నెలా నెలా చీటీవేస్తున్నారు. మండల పరిధిలోని గొట్టిపల్లి, రాచర్ల వడ్డికండ్రిగ, అగచాట్లపురం తదితర గ్రామాలకు చెందిన వంద మందికి పైగా మహిళలు, గ్రామస్తులు వారి వద్ద చీటీలు వేశారు. చీటీలు పాడుకున్న వారిని అధిక వడ్డీ ఇస్తామని నమ్మబలికిచి వారి నుంచి నగదును తీసుకునే వారు. చాలకాలం క్రితం వరకు నెలనెలా వడ్డీ నగదు చెల్లిస్తుండవారు. దీంతో చీటీలు వేస్తున్న వారు వడ్డీ అధికంగా వస్తుందన్న ఆశతో నగదు ఇచ్చారు. కొద్ది రోజులు కిందట రాజారెడ్డి కుటుంబ సభ్యులు గ్రామం నుంచి వెళ్లిపోయారు. వారికి నగదు ఇచ్చిన వారు లబోదిబోమంటూ వారికోసం వెతుకులాట మొదలుపెట్టారు. వారితో కలసి చీటీలు నిర్వహించే కొంత మంది మహిళలు విద్యానగర్‌లో ఉండడంతో వారిని కలసి తమ వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని కోరారు. అయితే వారు సరైన సమాధానం చెప్పడం లేదని బాధితులు నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐ నరసింహారావును కలసి మోసపోయామని ఫిర్యాదు చేశారు. సీఐ స్పందించి బాధితులను విచారిస్తున్నారు. పరారీలో ఉన్న వారికోసం ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

అడ్డుకుని..అవాస్తవాలా?

ఫ్యాక్ట్ చెక్

గూడూరు రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పచ్చపత్రికలు విషం కక్కుతున్నాయి. వాస్తవాలను కప్పిపుచ్చి ప్రజలను పక్కదోవపట్టిస్తున్నాయి. ఇందులో భాగంగానే ×ఓట్లకోసమే గాలం×అంటూ ఈనాడు దినపత్రిక శనివారం పతాక స్థాయిలో కథనాన్ని ప్రచురించింది. ఇందులో గూడూరులో జరిగిన వాస్తవాలను పక్కనబెట్టి అబద్ధపు రాతలతో రెచ్చిపోయింది. రోడ్లు, డ్రైన్ల నిర్మాణాన్ని స్థానిక టీడీపీ నేతలు అడుగడుగునా అడ్డుకుని.. పనులు ముందుకు సాగకుండా సబ్‌కాంట్రాక్టర్‌ను వెళ్లగొట్టినా ఆ నెపం వైఎస్సార్‌సీపీపై వేసి రాక్షసానందం పొందింది. అసలు వాస్తవాలు ఏంటో మీరే చదవండి.. 2021–22లో ఎంపీ స్పెషల్ గ్రాంట్ కింద గూడూరు పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సంబంధించి 11 పనులకుగాను మొదటి విడత రూ.12.50 కోట్లు, రెండో విడత మరో రూ.12.50 కోట్లు విడుదలయ్యాయి. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ టెండర్లు దక్కించుకుంది. అయితే స్థానికంగా గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు హరిచంద్రారెడ్డి సబ్‌కాంట్రాక్ట్ తీసుకున్నారు. మొదటి విడత పనులను సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల్లో పూర్తిచేసిన కాంట్రాక్టర్లు, 2022 ఫిబ్రవరి 28లోగా అధికారులు బిల్స్ అప్‌లోడ్ చేయని కారణంగా వారికి బిల్లులు చెల్లించలేదు. అయితే ఆ పనులు చేసిన వ్యక్తి కోర్టుకు వెళ్లి బిల్లులు తెచ్చుకున్నాడు. గూడూరులో టీడీపీ నాయకులు ఈ పనులు జరగకుండా అడుగడుగునా అడ్డుపడ్డారు. ఈక్రమంలో సబ్‌కాంట్రాక్టర్ హరిచంద్రారెడ్డి పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో టెండర్లు జరిగినా పనులు మొదలు పెట్టలేదు. ఈ పనులకు సంబంధించి ఇటీవల సీడీఎంఏ నుంచి మున్సిపల్ అధికారులను వివరణ కోరారు. రూ.15 కోట్లతో రీటెండరింగ్ పిలిచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని డీఈ శ్రీరామమూర్తి తెలిపారు. రూ.15 కోట్లలో మున్సిపల్ బిల్డింగ్‌కు రూ.1కోటి, కూరగాయల మార్కెట్‌కు రూ.1కోటి తోపాటు మిగిలిన మొత్తం సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు వెచ్చించనున్నట్లు వివరించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



వినోద్‌కుమార్‌రెడ్డి(ఫైల్)



మృతి చెందిన వినోద్‌కుమార్‌రెడ్డి

పెళ్లకూరు: ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చిల్లకూరులో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి పెద్ద కుమారుడు వినోద్‌కుమార్‌రెడ్డి(27) వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో చెరువుకట్ట సమీపంలో పొలం గట్లు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ నుంచి కింద పడ్డాడు. చక్రాలు వినోద్‌కుమార్‌రెడ్డి మీదుగా దూసుకెళ్లాయి. ఈ ఘటనలో వినోద్‌కుమార్‌రెడ్డి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి స్థానికులతో కలిసి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి భార్య సావిత్రి, కుమార్తె పావనిసిరి, కుమారుడు ధర్మతేజరెడ్డి ఉన్నారు. వినోద్‌కుమార్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.



